క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విందూరు విద్యార్థినులు



కె.శ్రీవర్షిణి, సీహెచ్ వెంకట జ్యోత్స్న

గూడూరు రూరల్ : మండలంలోని విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.శ్రీవర్షిణి, సీహెచ్ వెంకట జ్యోత్స్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. వారు ఈనెల 4వ తేదీ నుంచి 6 వరకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగే అండర్-17 పోటీల్లో పాల్గొంటారు. వారిని ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ మల్లికార్జునరావు శనివారం అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.కరీముల్లాఖాన్, ఉపాధ్యాయులు పుల్లంరాజు, వేణు పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్రం సభ్యుడిగా మనోజ్‌కుమార్

గూడూరు రూరల్ : నెహ్రూ యువ కేంద్రం తిరుపతి జిల్లా సలహా మండలి సభ్యుడిగా గూడూరుకు చెందిన గిద్దలూరి మనోజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నెహ్రూ యువ కేంద్రాల డైరెక్టర్ నితీష్‌కుమార్ మిశ్రా శనివారం ఉత్తర్వులు అందజేశారు. మనోజ్‌కుమార్‌ను పలువురు బీజేపీ నేతలు అభినందించారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెం గ్రామ పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు శ్రీనివాసులు, నాగేంద్రకుమార్, బేబీరాణి తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. గ్రామాల్లో మాతా శిశు సేవలు, రక్త హీనత నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గర్భిణులు, కిశోర బాలికల్లో హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల నిరసన



నిరసన తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం : విశాఖపట్టణంలో విధి నిర్వహణలో ఉన్న తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడంపై రెవెన్యూ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేసీ చైర్మన్, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం



దుకాణాల సముదాయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నిర్మిస్తున్న నేదురుమల్లి జనార్దన్ రెడ్డి దుకాణాల సముదాయంను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే అంబులెన్స్‌లకు డివైడర్ అడ్డంగా ఉన్న విషయాన్ని గుర్తించారు. డివైడర్‌ను కొంత మేరకు తొలగించే విషయంపై పాలకవర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. అనంతరం చెత్త తరలించే వాహనాలను నిలిపే షెడ్డును పరిశీలించారు. మున్సిపల్ మేనేజర్ ఎం ఖాజామొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కటకం జయరామయ్య, కౌన్సిలర్ అశోక్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఎంఈవోలకు సన్మానం



వెంకటగిరి రూరల్ : గణతంత్ర దినోత్సవం రోజున పురస్కారాలు అందుకున్న వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల ఎంఈవో-2లు బాబయ్య, ప్రదీప్, జగదీష్‌ను శనివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

కండలేరులో 11.776 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.776 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే



మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూ.వేల కోట్లు కేటాయిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం పొదుపు సంఘాల మహిళలకు రూ.4.80 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారని తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో మహిళలకు వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, బ్యాంక్ లింకేజీ రుణాలతోపాటు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి వద్దే అందజేస్తున్నట్టు తెలిపారు. ఓజిలి మండలంలో ఆసరా పథకం కింద 5,896 మంది లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.19 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. సంక్షేమ పరిపాలన మళ్లీ అందాలంటే సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అనంతరం సీఎం చిత్ర పటానికి మహిళలు, ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీంద్రరాజు, ఎంపీపీ అరుణారెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం నిర్మలమ్మ, కురుగొండ, కుందాం పీఏసీఎస్ అధ్యక్షులు ఉచ్చూరు శోభారాణి, రాజారామిరెడ్డి, మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు ప్రవీణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కనుమూరు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.బాబురెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, సుబ్బరావుయాదవ్, వెంకటసుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. పెళ్లకూరులో శనివారం వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడమే సీఎం జగన్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు అనేక కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో విజ్ఞత చూపి సంక్షేమానికి ఓటు వేయాలని కోరారు. అనంతరం మండలంలోని 647 సంఘాలకు రూ.4.37 కోట్ల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ మురళి, ఏపీఎం మునిరాజ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, జేసీఎస్ కన్వీనర్ కరణం రఘునాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్



మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, దేవసేనమ్మ

- మరోసారి జగనన్నను ఆదరించండి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్
- మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు

గూడూరు రూరల్ : సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తూ సంక్షేమ ప్రదాతగా నిలిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని సాయినగర్‌లో ఉన్న సీఆర్‌రెడ్డి.కల్యాణ మండపంలో శనివారం పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ చేశారు. పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ మండలంలోని 844 పొదుపు సంఘాల్లోని 7,784 మంది సభ్యులకు రూ.6.64 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. జగనన్న చేస్తున్న జనరంజక పరిపాలనను చూసి ఓర్వలేని చంద్రబాబు, పచ్చమీడియా దుష్ప్రచారం చేస్తున్నట్టు మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎం జగన్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ మహిళలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, మెప్మా సీఎంఎం కవిత, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాయకులు కోడూరు మీరారెడ్డి, నాగరాజు, మురళి, కోదండరామయ్య, సాయి,గోపాల్ యాదవ్, ముని, పూర్ణ, గఫూర్, అల్తాఫ్, అశోక్, అనుదీప్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు ముస్లింల అండ



దువా చేస్తున్న ముస్లింలు

కోట : ముస్లింలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని పలువురు తెలిపారు. కోట జామియా మసీదు వద్ద శనివారం ముస్లింలు సమావేశమై జగనన్నకు అల్లా ఆశీస్సులు ఉండాలని దువా చేశారు. గూడూరు నియోజకవర్గ మసీదుల కమిటీ అధ్యక్షుడు మొబీన్‌బాష మాట్లాడుతూ నెల్లూరు నగర వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా ఎండీ ఖలీల్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని, నేడు ఆయన తనయుడు మరో అడుగు ముందుకేసి ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. చంద్రబాబునాయుడు ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాష, షరీఫ్, కరీముల్లా, రఫీ పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన నేదురుమల్లి



జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేదురుమల్లి

సైదాపురం: నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆదిత్యరాజేంద్రనాథ్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

కనుల పండువగా నరసింహస్వామి కల్యాణం





స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, సుప్రభాతం చేపట్టారు. అనంతరం పూలంగి సేవ చేశారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

రాపూరు : మండలంలోని కండలేరు గురుకుల పాఠశాల-కళాశాలలో 2024-2024లో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో ఎంపీసీలో 40, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో ఇంగ్లీషు మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ సంవత్సరం నాలుగో తరగతి చదువుతున్నవారు అర్హులని, ఇంటర్‌కు పదో తరగతి చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలోని ఏ ప్రాంతం వారైనా ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి అవసరం



డక్కిలి: మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

డక్కిలి: ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయాలన్నారు. వెలుగొండ కింద వెంబులూరు, అంబేడ్కర్‌నగర్, డీ వడ్డిపల్లి, మాధవయ్యపాళెం, దేవులపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మాధవయ్యపాళెం సొసైటీ అధ్యక్షుడు వేణునాయుడు కోరారు. అదే విధంగా నడింపల్లికి అంగనవాడీ భవనం మంజూరు చేయాలని, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ ఏఎం రత్నం కోరారు. వైఎస్సార్ కాంత్రి పథం సిబ్బందిపై సమగ్ర విచారణ చేపట్టాలని లింగసముద్రం ఎంపీటీసీ నావూరు కోటేశ్వరయ్య కోరారు. మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో సి.లీలామాధవి, తహసీల్దార్ రమేష్‌బాబు, హౌసింగ్ డీఈ జహీర్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్, సీఆర్‌ఏఈఈలు నాగరాజు, చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ ఏఈఈలు బాబు, రాజా, ఏవో విజయభారతి, ఎంఈవో వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు పి.దశరథరామిరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేత



హైదరాబాద్‌లో శివప్రసాద్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ అశోక్

గూడూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న నెల్లటూరుకు చెందిన ఇసుకపల్లి శివప్రసాద్‌కు వలంటీర్ అశోక్ శనివారం పింఛను అందజేశారు. వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఊపిరి ఉన్నంత వరకు ప్రజా క్షేత్రంలోనే...



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపల్లి

గూడూరు రూరల్ : ఊపిరి ఉన్నంత వరకు ప్రజా జీవితంలో ఉంటానని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ తనకు మంచి రాజకీయ జీవితం ఇచ్చిందన్నారు. తాను ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఓజిలి: వేలంలో చేపల చెరువును దక్కించుకున్న వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు తెలిపారు. మాచవరం సచివాలయంలో శనివారం చేపల చెరువుకు వేలంపాటలు నిర్వహించారు. గూడూరుకు చెందిన బండి వంశీ రూ.1.82 లక్షలకు చెరువును దక్కించుకున్నాడు. ఈవోపీఆర్డీ మోహన్, పంచాయతీ కార్యదర్శి పెద్దమస్తానయ్య, వైఎస్సార్‌సీపీ నేత పిండుకూరు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై రైతులకు అవగాహన



కోట: ఎలుకల నివారణ ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరు రూరల్ : పొలాల్లో ఎలుకల నివారణతో పంటలను రక్షించుకోవచ్చని ఏడీఏ జి.ధనుంజయరెడ్డి తెలిపారు. పాలిచెర్ల రాజుపాళెంలో శనివారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ఎలుకల నివారణకు ప్రభుత్వం రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందు అందజేస్తోందన్నారు. అనంతరం బ్రోమోడయోలిన్ మందుతో ఎలుకల ఎర తయారీ పై అవగాహన కల్పించారు. గూడూరు వ్యవసాయశాఖ ఏడీ బి.గోపీనాయక్, టెక్నికల్ ఏవో చెంచురెడ్డి, వీఏఏ శివ పాల్గొన్నారు.

కోటలో..

కోట: రైతులు ఎలుకల నివారణ పద్ధతులను అనుసరించి పంటలను కాపాడుకోవాలని ఏడీఏ ధనుంజయరెడ్డి తెలిపారు. మండలంలోని చిట్టేడు లో శనివారం ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణ కోసం బ్రోమోడయోలిన్ మందు 100గ్రాములు, 6 కేజీల వరినూకలు, 120గ్రాముల నూనెతో కలిపి ఎరలుగా తయారు చేసి ఎలుకల కలుగుల్లో పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు నిరంజన్ కుమార్,సుచేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతోనే మంచి దిగుబడులు

వాకాడు : వరి సాగులో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి పంట దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారిణి దీప తెలిపారు. ఆమె శనివారం రైతులకు సామూహిక ఎలుకల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పంటకు ఎలుకల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు సామూహికంగా వాటిని నివారించుకోవాలన్నారు. 25 ఎకరాలకు సంబంధించిన రైతులు 6 కిలోల బియ్యం నూకలు, 125గ్రా వంట నూనె, 100 గ్రా బ్రోమోడయలిన్ మందుతో పిచికారీ చేసి 10 గ్రాముల చొప్పున ఎలుక కన్నాల వద్ద పెట్టాలన్నారు. తద్వారా ఎలుకలు నివారణ జరిగి మంచి పంట దిగుబడులు లభిస్తాయన్నారు.

ప్రతి లబ్ధిదారుడూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



తల్లంపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆర్డీవో చంద్రముని

దొరవారిసత్రం : నవరత్నాలులో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇంటి పట్టాలు ప్రతి లబ్ధిదారుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని తెలిపారు. ఆయన శనివారం తల్లంపాడు గ్రామ పరిధిలోని గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. అలాగే స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీవో సందర్శించారు. మెనూ ప్రకారం పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతోందా లేదా ఆరా తీశారు. అదే విధంగా తల్లంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, వీఆర్వో వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో చురుగ్గా పట్టాల రిజిస్ట్రేషన్లు



లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు చేస్తున్న అధికారులు

చిల్లకూరు : మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో శనివారం ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం ముత్యాలపాడు గ్రామ సచివాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు లబ్ధిదారులకు పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు అందజేశారు. వీఆర్‌వో రమణయ్య, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: ప్రభుత్వం పేదలకు జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతోంది. స్థానిక గ్రామ సచివాలయంలో లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు చేసి ఇళ్ల స్థలాలను వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సైదాపురం గ్రామ సచివాలయంలె పంచాయతీ కార్యదర్శి శశిఇంద్రాణి, వీఆర్వో హైమావతి, డిజిటల్ అసిస్టెంట్ పవన్, వెల్ఫేర్ అసిస్టెంట్ సిద్ధయ్య తదితరులు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గూడూరు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న డిప్యూటీ డీఈవో

గూడూరు రూరల్ : జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు గూడూరులోని జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి నవీన్‌కుమార్ ఎంపికైనట్లు డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో నవీన్‌కుమార్ 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. బాలుడు ఈ నెల 16 నుంచి 18 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి నిడ్ జామ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని పీడీ వెంకటసుబ్బయ్య ట్రాక్ షూస్, క్రీడా దుస్తులు అందజేశారు. హెచ్ఎం మున్వర్‌బాషా, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శివకుమార్, మ్యాజిక్ బస్సు సంస్థ కోచ్ లత, మౌనేంద్ర అభినందించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

చిల్లకూరు: ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో భానుమూర్తి ఆదేశించారు. ఆయన శనివారం మండలంలోని ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న పనులు, మొదలు కాని పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు. ఉపాధి ఏపీవో గిరి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ పాల్గొన్నారు.

గుంతలో పడి యువకుడి మృతి



మృతదేహాన్ని మోసుకుని వస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

గూడూరు రూరల్: స్నేహితులతో కలిసి సరదాగా వెళ్లిన యువకుడు గుంతలో పడి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గూడూరులోని శాంతినగర్‌కు చెందిన గోళ్ల కృపానందం(29) గత నెల 29న స్నేహితులతో కలిసి సరదాగా బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించలేదు. దీనిపై కుటుంబ సభ్యులు గత నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆరు రోజుల తరువాత చెన్నూరు సమీపంలోని ఓ గుంతలో కుళ్లిన మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అటు తర్వాత మృతదేహాన్ని బయటకు తీసి వివరాలు సేకరించారు. కృపానందం కుటుంబ సభ్యులను పిలిపించి విచారించగా వారు మృతదేహం తమ కుమారుడిదేనని చెప్పారు. స్నేహితులతో కలిసి చెన్నూరుకు వెళ్లిన కృపానందం గుంతలో దిగి మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న రూరల్ సీఐ

గుంతలో మృతదేహం ఉన్నట్టు ఆరు రోజుల తర్వాత పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అయితే అప్పటికే మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లడంతో బయటకు తీసేందుకు ఎవ్వరూ సాహసించలేదు. అయితే సీఐ వేణుగోపాలు స్వయంగా గుంతలోకి దిగి మృతదేహాన్ని బయటక తీశారు. ఆపై పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.